క్లుప్తంగా

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ

కాకినాడ రూరల్: బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యమని రూరల్ జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ పేర్కొన్నారు. వచ్చేనెల 3న సర్పవరం జంక్షన్ వద్ద జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేసేందుకు వలసపాకలలో సోమవారం సమావేశం నిర్వహించారు. సభకు వలసపాకల నుంచి అన్ని వర్గాల వారు భారీగా హాజరు కావాలని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కృష్ణంరాజు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

దుగ్గన బాబ్జీని సస్పెండ్ చేయండి

కన్నబాబుకు ద్వారంపూడి లేఖ



దుగ్గన బాబ్జీ

కాకినాడ: వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ మాజీ అధ్యక్షుడు దుగ్గన బాబ్జీని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబును కోరారు. ఈ మేరకు ఆదివారం ద్వారంపూడితో పాటు, వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న కూడా కన్నబాబుకు దుగ్గన తీరుపై ఫిర్యాదు చేశారు. ప్రతిపక్ష పార్టీలతో కుమ్మక్కు కావడం, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం, వైఎస్సార్ సీపీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్న బాబ్జీని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో దుగ్గనపై త్వరలో వేటు పడనుంది.

లారీ వర్కర్స్ యూనియన్ రాజీనామా

కాకినాడ: ది కాకినాడ మోటారు లారీ వర్కర్స్ యూనియన్ ప్రస్తుత కార్యవర్గం రాజీనామా చేసింది. ఈ మేరకు తమ రాజీనామా లేఖలను కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజుకు శనివారం అందజేశారు. ప్రస్తుత కార్యవర్గ పదవీకాలం రెండేళ్లు పూర్తి కావస్తున్న నేపథ్యంలో అనివార్య కారణాల వల్ల పదవుల నుంచి తప్పుకొంటున్నట్టు స్పష్టం చేశారు. రాజీనామా లేఖతో పాటు యూనియన్ లావాదేవీల రికార్డులను కూడా అందజేశారు. రాజీనామా చేసిన వారిలో యూనియన్ అధ్యక్షుడు కలగా పాల్ పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి చందల లోవరాజు, కోశాధికారి జీరి రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా సుందరకాండ పారాయణం



సుందరకాండ పారాయణం చేస్తున్న భక్త బృందం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ వద్ద ఆంజనేయ ఆలయం వద్ద సోమవారం సుందరకాండ పారాయణం చేశారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త కామరాజు ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన శ్రీఅభయాంజనేయ భక్త మండలి గురువు ఏలేశ్వరపు ఆదిలక్ష్మి, బృందం సభ్యులు పారాయణం చేశారు. రమణయ్యపేట ఏపీఐఐసీ ఆంజనేయ ఆలయం వద్ద తమ 429 పారాయణంలో బృందం సభ్యులు ఎస్.శ్రీరాములు, ఎస్.చంద్రరావు, ఎం.వీరభద్రరావు, కర్రి సుధ, నిరోగి లలిత, బుల్లెమ్మాయి, వరలక్ష్మి, చంద్రరావు, పాల్గొనట్టు తెలిపారు.

వ్యాన్ బోల్తా

గండేపల్లి: 16వ నెంబర్ జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తా కొట్టిన ఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం ప్రకారం.. హైదరాబాద్ నుంచి అనకాపల్లి సమీపంలోని అచ్చుతాపురానికి ప్లేవుడ్ లోడుతో వెళుతుండగా వ్యాన్ నీలాద్రిరావుపేట పరిధి పరిణయ ఫంక్షన్ హాల్ వద్దకు వచ్చే సరికి రోడ్డుకు మధ్యలో ఉన్న ఐరన్ గ్రిల్స్, పోల్‌ను ఢీకొట్టడంతో వ్యాన్‌కు వెనక వైపు ఉన్న చక్రాలు ఊడిపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నవీన్ సురక్షితంగా బయటపడ్డాడు. హైవే మెయింటినెన్స్ సిబ్బంది రోడ్డుపై నిలిచిన ట్రాఫిక్‌ను పక్క క్రమబద్ధీకరించి, వ్యాన్‌ను క్రేన్ సహాయంతో పక్కకు తీయించారు.

పత్ర కషాయంపై శిక్షణ

జగ్గంపేట: మర్రిపాక గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతులకు, డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు పది రకాల పత్రాలతో 200 లీటర్ల కషాయం తయారు చేయడంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం డ్వాక్రా మహిళలకు కిచెన్ గార్డెన్ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఉద్యానం.. ఉల్లాసం



పార్కులో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన స్కేటింగ్ రింక్



ఓపెన్ జిమ్‌లో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు

- ఆకర్షణీయంగా జన్మభూమి పార్కు
- చిన్నారులకు, వాకింగ్, స్కేటింగ్ క్రీడాకారులకు వసతుల ఏర్పాటు
- సౌకర్యాలపై సందర్శకుల హర్షం

బోట్‌క్లబ్: చక్కని వాతావరణంలో సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతోంది శ్రీనగర్‌లోని జన్మభూమి పార్కు. కార్పొరేషన్ పరిధిలోని ఐదో డివిజన్‌లో ఈ పార్కు గతంలో నిరాదరణకు గురై, కంపచెట్లతో అస్తవ్యస్తంగా ఉండేది. కార్పొరేషన్ ప్రత్యేక నిధులను కేటాయించడంతో పార్కు రూపురేఖలే మారిపోయాయి. చుట్టూ పరచుకున్న పచ్చదనం, సందర్శకులు కూర్చునేందుకు వీలుగా బెంచీలు, చిన్నారులకు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదంతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.12 కోట్లతో అభివృద్ధి

కాకినాడ కార్పొరేషన్ నిధులతో పార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పార్కులో అందమైన మొక్కలను ఏర్పాటు చేయడంతో పార్కు కళకళలాడుతోంది. పార్కు సంరక్షణతోపాటు సుందరీకరణకు రూ.1.12 కోట్లు కార్పొరేషన్ నిధులను సమకూర్చడంతో పార్కు అందంగా తయారై ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఓపెన్ జిమ్, కూర్చేనేందుకు బల్లలు, ప్రహరీ, వాకింగ్ ట్రాక్, పార్కు చుట్టూ డ్రైనేజీ, ప్రవేశ ద్వారం ఇలా అన్ని సదుపాయాలతో పార్కు ప్రజలకు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని పంచుతోంది. స్కేటింగ్ నేర్చుకునేందుకు మినీ స్కేటింగ్ రింక్ రూ.18 లక్షలతో ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతలో నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన చిన్నారులు ఈ స్కేటింగ్ నేర్చుకొంటున్నారు.



చిన్నారులు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన ఆట వస్తువులు



వాకర్ల కోసం అనువుగా తయారుచేసిన వాకింగ్ ట్రాక్

పెరుగుతున్న సందర్శకులు

గతంలో పిచ్చి మొక్కలు ఉండడంతో పార్కులో అడుగు పెట్టాలంటే ప్రజలు భయపడేవారు. కేవలం వాకింగ్ చేసేందుకు మాత్రమే స్థానికులు వినియోగించేవారు. అలసట వస్తే కూర్చునేందుకు అవకాశం ఉండేది కాదు. ప్రస్తుతం పార్కులో చక్కని వాతావరణం, వసతుల కల్పనతో సందర్శకుల సంఖ్య పెరుగుతోంది. ఓపెన్ జిమ్ ఏర్పాటుతో ఆరోగ్యాభిలాషులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వస్తున్నారు. దీంతో పార్కు ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సహకారంతో పార్కు అభివృద్ధి సాధ్యమైంది. పార్కు పరిస్థితిని ఆయనకు వివరించగానే ఆయన సూచనల మేరకు కార్పొరేషన్ అధికారులు రూ.1.12 కోట్లు మంజూరు చేశారు. దీంతో పార్కులో ఓపెన్ జిమ్, స్కేటింగ్ రింక్, వాకింగ్ ట్రాక్, పిల్లలకు ఆట పరికరాలు సమకూర్చారు.

– నల్లబిల్లి సుజాత, 5 డివిజన్ మాజీ కార్పొరేటర్

వాకింగ్‌కు ఎంతో అనువుగా ఉంది



గతంలో నడవాలంటే భయమేసేది. ఇప్పుడు పార్కును బాగా అభివృద్ధి చేశారు. వాకింగ్ చేయడానికి ఎంతో అనుకూలంగా ఉండేది. మా లాంటి వారికి ఈ పార్కు చాలా బాగా ఉపయోగంగా ఉంది. చిన్నారులు, వృద్ధులకు ఎంతో సేదతీరచ్చు.

– ముమ్మిడి విశ్వేశ్వరరావు, స్థానికుడు

అమరుడైన బేబీరావు కుటుంబానికి సత్కారం



బేబీరావు కుటుంబాన్ని సత్కరిస్తున్న అడిషనల్ కమాండెంట్ భద్రయ్య

కాకినాడ రూరల్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ అచీవర్స్‌ను సన్మానించారు. బెటాలియన్ కమాండెంట్ సీహెచ్ విజయరావు ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ మూడవ బెటాలియన్‌కు చెందిన సీహెచ్ బేబీరావు (పీసీ 1268) నక్సలైట్ కాల్పుల్లో అమరుడయ్యారు. ఆయన కుమారుడు ప్రకాష్ రావు బ్యాంక్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. బేబీరావు భార్యను, ఆయన కుమారుడిని భద్రయ్య సత్కరించి జ్ఞాపకను అందజేశారు. భద్రయ్య మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా అమరవీరులను గుర్తు చేసుకుంటూ వారి కుటుంబ సభ్యులను ఇలా సన్మానించడం బెటాలియన్‌లో ప్రతి సంవత్సరం జరుతోందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎల్.అర్జున్, ఆర్ఎస్ఐ సురేష్ బాబు, వి.రాము, సతీష్, శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్



వాకాదలో జీపీఎస్ చేసిన వాహన యజమానులతో ఎంఏఓ రాజేష్

కరప: ఖరీఫ్‌లో ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు చేరవేసేందుకు వాహనాలకు జీపీఎస్ చేస్తున్నామని, యజమానులు ముందుకువచ్చి తమ వాహనాలకు జీపీఎస్ చేయించుకోవాలని ఎంఏఓ ఏవీ రాజేష్ తెలిపారు. వాకాడ రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం రవాణా చేసేందుకు ముందుకువచ్చిన 42 ట్రాక్టర్లు, ఇతర వాహనాలకు జీపీఎస్ చేసి, యజమానుల వివరాలు సేకరించారు. మండల పరిధిలో 114 వాహనాలను గుర్తించినట్టు వాకాడ పరిసర గ్రామాల వాహనాలకు జీపీఎస్ చేశామని, మంగళవారం కరప, పెనుగుదురులలో చేయనునన్నట్టు తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే వచ్చి తమ వాహనాల వివరాలు ఇచ్చి, జీపీఎస్ చేయించుకోవాలన్నారు. జీపీఎస్ చేసిన వాహనాలను మండలంలోని ఆర్‌బీకేల వద్ద అందుబాటులో ఉంచుతామన్నారు. రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని జీపీఎస్ చేసిన వాహనాల ద్వారా రైస్ మిల్లులకు చేరవేస్తామని ఎంఏఓ తెలిపారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయానికి సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో స్వామిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్‌లు తొలి పూజ, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తుల కోసం దేవస్థానం తరపున అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవాదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. పంచారామ క్షేత్రంలో వేంచేసిన వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు.

ప్రతి సమస్యకూ నాణ్యమైన పరిష్కారం

కమిషనర్ నాగ నరసింహారావు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకూ నాణ్యమైన పరిష్కారం అందిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు హామీ ఇచ్చారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం తొలుత డయల్ యువర్ కమిషనర్ నిర్వహించి వినతులను స్వీకరించారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాలకు సంబంధించి 9 మంది సమస్యలను విన్నవించారు. అనంతరం స్పందనలో ఏడుగురు వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ నాగ నరసింహారావు అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని, వచ్చిన ప్రతి సమస్యను నిర్దేశించిన సమయంలో పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చేందుకు కార్పొరేషన్ వరకు రాలేని ప్రజలు స్థానిక సచివాలయాల్లో కూడా ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈలు వెంకట్రావు, మాధవి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్‌ఓ మానే కృష్ణమోహన్, పలువురు డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ సతీష్‌కుమార్



పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కొత్తపల్లి: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. విధి నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. నేరం చేసేవారికి శిక్ష పడడం వల్లే నేరాలను అదుపు చేయవచ్చన్నారు. ముఖ్యంగా మహిళల రక్షణకు దిశ యాప్‌ను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్య, భార్యభర్తల వివాదాలే వస్తున్నాయని, వీటిని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. తీరప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, సారాను నియంత్రించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఉత్సవాల పేరుతో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీల్లో సీఐ శ్రీనివాస్, ఎస్సై స్వామి నాయుడు, సిబ్బంది ఉన్నారు.

పక్షవాతానికి సత్వర చికిత్స అవసరం



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ కామరాజు

కాకినాడ రూరల్: మెదడులో ఉన్న కణాలకు, రక్తనాళాలకు నష్టం జరిగి రక్తం సరఫరా కాకపోతే శరీరంలో కుడి లేదా ఎడమ వైపు ఉన్న అవయవాలు చచ్చుబడడాన్ని పక్షవాతం అంటామని, పక్షవాతానికి వెంటనే వైద్య చికిత్స అవసరమని ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ బెజవాడ కామరాజు పేర్కొన్నారు. బోట్‌క్లబ్ ఉద్యానవనంలో లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ప్రపంచ పక్షవాత నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. అనంతరం వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ కామరాజును సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, యనమల రామం, శ్రీనివాసరావు, దాసరి శ్రీధర్, ద్వారంపూడి విపుల్ రెడ్డి, షబ్బీర్, వై.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు మీరి ఓట్లు తొలగించొద్దు

ఈఆర్వో సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఈఆర్వో సుబ్బారావు

పిఠాపురం: నిబంధనలకు విరుద్ధంగా ఒక్క ఓటు కూడా తొలగించరాదని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కె.సుబ్బారావు ఎన్నికల సిబ్బందికి సూచించారు. నియోజకవర్గంలో పిఠాపురం మున్సిపాలిటీ, పిఠాపురం మండలం, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు మండలాల పరిధిలో ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన సమగ్ర అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన బీఎల్ఓలకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈనెల 27న ఎన్నికల జాబితా ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశామన్నారు. నియోజకవర్గ ముసాయిదా ఓటరు జాబితాలో పురుషులు 1,14,261 మంది, స్త్రీలు 1,13,942 మంది, ఇతరులు ముగ్గురు మొత్తం 2,28,206 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వచ్చే ఏడాది జనవరి 1న అర్హత తేదీగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు నుంచి వినతులు డిసెంబర్ 9వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. 2024 జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని ఆయన తెలిపారు. దీనిలో బాగంగా బూత్ లెవెల్ అధికారులకు పూర్తి అవగాహన కల్పించామన్నారు. అర్హులైన ఓటర్ల నమోదు, మరణించినా, శాశ్వతంగా వలస వెళ్లినా డబుల్ ఎంట్రీ పడిన ఓటర్లను ఎలక్షన్ కమిషన్ వారి నిబంధనల మేరకు తొలగించడం ద్వారా తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రత్యేక శిబిరాల ఏర్పాటు ద్వారా ఓటర్ల సవరణ చేపట్టాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఒక వ్యక్తి మూడు కంటే ఎక్కువ కే దాఖలు చేస్తే త్రీ మెంబర్ కమిటీ ద్వారా సదరు వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ప్రతి మంగళవారం సమావేశాలు నిర్వహించి ఓటరు జాబితా సవరణపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు నిదర్శనం అమృత కలశయాత్ర

యానాం: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నా మట్టి–నా దేశం కార్యక్రమం దేశ సమైక్యతకు నిదర్శనంగా నిలుస్తుందని లంక వినయ్ అన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలో జరిగిన అమృత కలశ యాత్ర, అమృత్ మహోత్సవ్ ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే భారతం–శ్రేష్ఠ భారతం భావనను ఈ కార్యక్రమం సాకారం చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి సేకరించిన మట్టితో ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం సమీపంలో అమృతవాటికను నిర్మాణం చేయనున్నారన్నారు.

విద్యార్థులకు అవార్డులు, రివార్డులు



ఎస్పీ నుంచి ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులు

కాకినాడ క్రైం: పోలీస్ అమర వీరుల దినోత్సవాల్లో భాగంగా ఈ నెల 28న నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో ఎంపికైన ఏడుగురు విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. వ్యాసరచన పోటీలలో బి.సౌమ్యదేవి, ఎం.అశ్వినిమూర్తి, ఓ.భాను, ఓ.కిరణ్మయి ఎంపిక కాగా, వక్తృత్వ పోటీల్లో మిని ఆంటోని, పి.రిత్విక, వి.దుర్గాభవాని ఎంపికయ్యారు. ఈ ఏడుగురుకి ఎస్పీ సతీష్‌కుమార్ సోమవారం కాకినాడలోని ఎస్పీ కార్యాలయంలో అవార్డులు, రివార్డులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు సతీష్



కొత్తపల్లి: అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో వచ్చేనెల 3 నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు మూలపేట జెడ్పీ పాఠశాల విద్యార్థి పి.సతీష్ ఎంపికై నట్లు హెచ్ఎం జి.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు పోటీల్లో 9 తరగతి చదువుతున్న పి.సతీష్ ఎంపికైనట్లు తెలిపారు. సతీష్‌ను, శిక్షణ ఇచ్చిన వ్యాయాయ ఉపాధ్యాయుడు హరిబాబు, సునీత, ప్రసన్నకుమార్‌లను సర్పంచ్ కంభాల మౌనిక, ఎంపీటీసీలు అడ్డా పాప, గోగు లోవకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి



తాళ్లరేవు హైస్కూల్‌లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న సైన్స్ టాస్క్‌ఫోర్స్ అధికారి షాజీనా పర్వీన్

తాళ్లరేవు: ఉపాధ్యాయులందరూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని రాష్ట్ర సైన్స్ టాస్క్‌ఫోర్స్ అధికారి షాజీనా పర్వీన్ అన్నారు. సోమవారం స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఆమె నేతృత్వంలోని బృందం పరిశీలించింది. ల్యాబ్ నిర్వహణకు సంబంధించిన పత్రాలు పరిశీలించిన అనంతరం విద్యార్థులను ప్రశ్నించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, స్కూల్ హెచ్ఎం జొన్నాడ ఆశాలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల అదుపు

పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి

సామర్లకోట: సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలు అదుపు చేయడానికి అవకాశం ఉందని, దానికి వ్యాపారులు సహకరించాలని పెద్దాపురం పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పిలుపునిచ్చారు. స్థానిక క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం సాయంత్రం పట్టణ పరిధిలోని వ్యాపారులకు సీసీ కెమెరాల ఏర్పాటుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. వ్యాపారులు విధిగా షాపులు, వ్యాపార సంస్థల వద్ద రోడ్డును కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల వల్ల ప్రతిఒక్కరికీ ప్రయోజనం కలగడంతో పాటు ఇతరులకు మేలు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. సీసీ కెమెరాలతో ఏవిధంగా నేరస్తులను గుర్తించడానికి అవకాశం ఉంటుందో క్రైమ్ సబ్ డివిజన్ సీఐ కిషోర్‌బాబు వివరించారు. తాము గుర్తించిన వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్దాపురం సీఐ రవికుమార్, సామర్లకోట సీఐ కె.దుర్గాప్రసాద్, క్రైమ్ సిబ్బంది, పట్టణ పరిధిలో వ్యాపారులు పాల్గొన్నారు.